క్లుప్తంగా

మిసెస్ ఇండియా రన్నర్‌కు అభినందన



రమాచౌదరిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: మిసెస్ ఇండియా పోటీల్లో రన్నర్‌గా నిలిచిన మండలంలోని పెదనడిపల్లి గ్రామానికి చెందిన వెలిచేటి రమాచౌదరిని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు శనివారం తన నివాసంలో సత్కరించి, అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెమా సంస్థ జూన్ 27న ఇండోర్‌లో నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీల్లో రమా చౌదరి ద్వితీయస్థానం దక్కించుకోవడం ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో రమా చౌదరి భర్త రవి, అత్తమామలు పాల్గొన్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్త, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సొంత పెదనాన్న కుమారుడు కడుబండి ప్రసాద్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో తన స్వగ్రామం గుచ్చిమిలో మృతి చెందారు. ఆయన్ని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు కడుబండి రమేష్‌నాయుడు, వింద్యవాసి సర్పంచ్ రంభ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి



దమరసింగిలో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. మండలంలోని దమరసింగి గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, పెద్దలు ఎవరికైనా ఆరోగ్యసమస్యలు తలెత్తితే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. సకాలంలో వైద్యం అందించకుండా నాటువైద్యులను, దాసుళ్లను ఆశ్రయించి కాలయాపన చేస్తే వారి ప్రమాదాలకే ముప్పు అని అన్నారు. చిల్లంగి, చేతబడి వంటి మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. ఏఎస్‌ఐ కామేశ్వర రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాగు కాలువ పనుల పరిశీలన



కాలవ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలసలో కొండవాగు నుంచి గ్రామంలోని మండపు నాయుడు చెరువుకు సాగునీటిని మళ్లించేందుకు రూ.1.43 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న కాలువ పనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ శనివారం పరిశీలించారు. పనులు చేస్తున్న వేతన దారులకు ఆయన పలు సూచనలు చేశారు. వర్షాలు కురిసేటప్పుడు కొండవాగు నుంచి వచ్చే వరద నీరు వృథా కాకుండా చెరువుకు మళ్లిస్తామని, తద్వారా రైతులకు సాగునీరు అందుతుందని ఏపీఓ తెలిపారు. ఆయ న వెంట టెక్నికల్ అసిస్టెంట్ ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రేగన సాయిజ్యోతి ఉన్నారు.

తీర్పును పునః సమీక్షించాలి

శృంగవరపుకోట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని జిల్లా దళిత నాయకులు తెరపల్లి కోటరావు, గుర్రపు శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. తీర్పుపై తమ నిరసన తెలిపారు. దళితుల ఐక్యతను దెబ్బతీసేలా, ఓటు బ్యాంకును చీల్చడానికి బీజేపీ పన్నిన రాజకీయకుట్ర ఎస్సీ వర్గీకరణ అని ఆరోపించారు.గతంలో ఎస్సీ వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఇప్పుడు కుల వర్గీకరణకు రాష్ట్రాలకు అనుమతించడం సరికాదని, ఈ తీర్పును నిలిపివేయాలని కోరారు.

రెండు పశువుల వ్యాన్లు సీజ్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం రాత్రి చేసిన వాహన తనిఖీల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వ్యాన్లను సీజ్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మహేష్ తెలిపారు. పెదమానాపురం నుంచి అలమండకు నిబంధనలకు విరుద్ధంగా రెండు వ్యాన్లలో 22 పశువులను తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



గంట్యాడ: పెదమజ్జిపాలెంలో తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, పి.ఎం.పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి పల్లవి



బొండపల్లి: గరుడుబిల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లి పాలే ఇవ్వాలని వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్ వాడీ సిబ్బంది సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలుగ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు శనివారం అవగాహన కల్పించ డంలో పాటు ర్యాలీలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించడంతో పాటు గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

– గంట్యాడ/మెరకముడిదాం/దత్తిరాజేరు/కొత్తవలస/బొండపల్లి/జామి/శృంగవరపుకోట



శృంగవరపుకోట: వెంకటరమణపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది



జామి: వి.ఆర్.పాలెంలో బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి



కొత్తవలస: వియ్యంపేటలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది



దత్తిరాజేరు: మరడాంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మెరకముడిదాం: భైరీపురంలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది

రూ.3.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం



అయ్యప్ప ఆలయ నిర్మాణం వద్ద మాట్లాడుతున్న ట్రస్టు బోర్డు సభ్యులు



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత గోపి

చీపురుపల్లి: జిల్లాలోఎక్కడా లేని విధంగా శబరిమల దేవస్థానం ఆకారంలో చీపురుపల్లిలో శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయా న్ని నిర్మిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణ ప్రదేశంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన గంట్యాడ సీతరాజు, విష్ణుమూర్తి 50 సెంట్ల స్థలాన్ని ఆలయ నిర్మాణం కోసం ఇచ్చారని చెప్పారు. ఆ స్థలంలో తొలుత రూ.కోటి అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించగా ఇప్పుడు ఆ వ్యయం అంచనా రూ.3.5 కోట్లకు పెరిగిందన్నారు. పది వేల ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణంలో స్లాబు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఏకశిలతో పడిమెట్ల(18 మెట్లు) నిర్మాణం చేపడుతున్నామని, దీని కోసమే రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏకశిలతో పడిమెట్లు ఉన్న దేవస్థానంలో మాత్రమే అయ్యప్ప మాలాధారణ, మాల విసర్జన సాధ్యపడుతుందన్నారు. ఇంతవరకు చీపురుపల్లితో పాటు పరిసర ప్రాంతాల్లో దాతల నుంచి రూ.70 లక్షల వరకు ఆర్థిక సహకారం లభించిందన్నారు. ఇక్కడ అయ్యప్ప గుడితో పాటు సుబ్రహ్మణ్యస్వామి, వినాయక గుడి నిర్మాణం జరుగుతోందన్నారు. శబరిమలలో ఉన్న అయ్యప్ప దేవస్థానం మాదిరిగా ఇక్కడ ఆలయాన్ని తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని, ఇంకా దాతలు ముందుకొచ్చి సహకరించాలని కోరారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, కొంచాడ శ్రీనివాసరావు, ఎస్.సన్యాసిరావు, దిలీప్‌కుమార్ ధనూకా, దాసరి రవి, గంట్యాడ సీతరాజు, రెడ్డి లక్ష్మణ, గొల్ల, గుడ్ల శ్రీను, వాసురెడ్డి, దాసరి రవి, బెల్లాన శ్రీను, నాగు, పుండరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన రెడ్డి గోపి రూ.50,116 ఆర్థిక సహాయం చేశారు. శనివారం ఆయన తన నివాసంలో డబ్బులను ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు అందజేశారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

- జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, ఎట్టి పరిస్థితుల్లో వాటి జోలికి వెళ్లద్దని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలు, నిరోధంపై ఏపీ స్టేట్ లీగల్‌సెల్ అథారిటీ ఆదేశాల మేరకు పట్ట ణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, రవాణా నేరమనేని స్పష్టం చేసారు. మాదకద్రవ్యాలతో పట్టుబడిన తర్వాత అందులో ఏముందో తనకు తెలియదని చెప్పినా ఎలాంటి ఫలితం ఉండదన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలతో దొరికితే కిలో లోపు అయితే సంవత్సరం జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని, అదే కిలోదాటి పట్టుబడితే పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారని వివరించా రు. అలాగే గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చట్టాలు కూడా ఉన్నా యన్నారు. మాదకద్రవ్యాలు దాచుకునేందుకు స్థలం ఇచ్చినా, గంజాయి పండించేందుకు భూములు లీజుకు ఇచ్చినా నేరం పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు, న్యాయవాదులు ఆర్.నాగభూషణపట్నాయక్, జగదీష్, కె.త్రినాథ్, రఘుపతినాయుడు, కిరణ్, కళాశాల కరస్పాండెంట్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్ల లోపు వారంతా రక్తదానం చేయవచ్చని గరివిడి వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను అన్నారు. జాతీయసేవా పథకంలో భాగంగా వెటర్నరీ కళా శాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 54 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలై సకాలంలో రక్తం అందక ప్రాణాలు విడుస్తున్నారని, మనం చేసే రక్తదానం అలాంటి ఎన్నో ప్రాణాలను నిలుపుతుందన్నారు. అపోహలు వీడి రక్తదా నం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చీపురుపల్లి సీహెచ్‌సి వైద్యాధికారి ఝాన్సీరాణి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది డాక్టర్ వై.ఆర్.అంబేడ్కర్, డాక్టర్ ఇక్బాల్‌హైదర్, డాక్టర్ షేక్ మస్తాన్, డాక్టర్ కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేపాడలో నేత్రవైద్య శిబిరం

వేపాడ: మండల కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు సమన్వయకర్త జోగారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు శిబిరంలో సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించి కళ్లద్దాలు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. శిబిరానికి ఆధార్ రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని రావాలని, ఈ అవకాశాన్ని నేత్ర సమస్యలు ఉన్న వారు సద్వినియోగించుకోవాలని సూచించారు.

6న సీహెచ్‌సీలో సదరం

చీపురుపల్లి: దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీకి సంబంధించి స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఈనెల 5న నిర్వహించాల్సిన సదరం కార్యక్రమాన్ని 6వ తేదీ మంగ ళవారానికి వాయిదా వేసినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీహెచ్‌సీలో పని చేస్తున్న రేడియో గ్రాఫర్ నెల రోజులు సెలవుపై వెళ్ల డంతో ఆయన స్థానంలో ఎస్.కోట సీహెచ్‌సీలో పనిచేస్తున్న రేడియోగ్రాఫర్‌ను వారానికి మూడు రోజులు తాత్కాలికంగా ఇక్కడ నియమించినట్లు తెలిపారు. ఎస్.కోట రేడియోగ్రాఫర్ ఈ నెల 6న సీహెచ్‌సీకి వస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న వారంతా గమనించి ఆ రోజు సీహెచ్‌సీకి రావాలని కోరారు.

రుణ లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలి

- డీఆర్డీఏ ఏపీడీ సావిత్రి



మాట్లాడుతున్న డీఆర్డీఏ ఏపీడీ సావిత్రి

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు శతశాతం పూర్తి చేయాలని డీఆర్డీఏ ఏపీడీ కె.సావిత్రి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బ్యాంకర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రుణ సంబంధిత పథకాలను బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నూరు శాతం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. సంఘ సభ్యులకు అవసరమైన మేరకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌జీఈ రుణాలు అందజేయాలని కోరారు. వెలుగు ఏసీ బంగారమ్మ, ఏపీఎం ఎం.వి.రాజశేఖర్, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అభినందనలు తెలిపారు. ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం ఆయన విశాఖపట్నం వెళ్లి బొత్స సత్యనారాయణను కలిశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము కానీయకుండా బొత్స విజయానికి కృషి చేస్తామన్నారు. ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాస రావు, కొత్తవలస మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, నాయకులు వాకాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ధీర ఫౌండేషన్ సమకూర్చిన ప్రింటర్‌ను ఉపాధ్యాయులకు అందిస్తున్న పూర్వ విద్యార్థి సంజీవి

జామి: అలమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ధీర ఫౌండేషన్ కలర్ ప్రింటర్ వితరణ చేసింది. పాఠశాలకు ప్రింటర్ సమ కూర్చాలని పూర్వ విద్యార్థి వి.సంజీవి ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌ను కోరడంతో ఆయన స్పందించి ప్రింటర్ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థి సంజీవి శనివారం ప్రింటర్ అందజేశారు. ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఆయిల్ పామ్‌ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు, హెచ్ఓ, రైతులు

వేపాడ: ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జీఎం విజయప్రసాద్ అన్నారు. ఉద్యానవన శాఖ అధికారి పద్మ నేతృత్వంలో, కంపెనీ జోనల్ మేనేజర్ జోషీ కిరణ్ అధ్వర్యంలో కడకొండ గ్రామంలో రైతు నంబారు గంగన్న వ్యవసాయక్షేత్రంలో శనివారం ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ ఎకరా వరిసాగుకు అవసరమయ్యే నీటితో మూడెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని చెప్పారు. దళారీవ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పారదర్శకంగా ఆయిల్‌పామ్ గెలల సేకరణ ఉంటుందన్నారు. నర్సరీల ద్వారా స్వదేశీ, విదేశీ మొక్కలను అందిస్తు న్నామని చెప్పారు. పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

ఔషధ గార్డెన్‌లు ఏర్పాటు చేయండి



రాచకిండాం పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న ఏపీ జీవవైవిధ్య బోర్డు సెక్రటరీ కృష్ణమూర్తి

బొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల ఆవరణాల్లో కిచెన్ గార్డెన్‌లతో పాటు, మెడిషనల్(ఔషధ) ఫారెస్టు గార్డెన్లు ఏర్పాటు చేయాలని ఏపీ జీవవైవిధ్య బోర్డు సెక్రటరీ బి.వి.ఏ.కృష్ణ మూర్తి సూచించారు.మండలంలోని గొట్లాం, రాచకిండాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి మెడిషనల్ (ఔషధ) ఫారెస్టు గార్డెన్ల ఏర్పాటుపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.పంచాయతీ తీర్మానం చేసి నివేదికను పంపిస్తే వెంటనే గార్డెన్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట ఏపీ జీవవైవిధ్య బోర్డు రీజనల్ కో–ఆర్డినేటర్ జానకీరామ్, డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఎస్‌జీసీ కో–ఆర్డినేటర్ బి.వేణుగోపాల్, ఎంఈఓ ఏ.వెంకటరమణ ఉన్నారు.

పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న బీజేపీ కార్యదర్శి భారతి

గజపతినగరం: మండలంలోని ఎన్.జి.ఆర్.పురం గ్రామ ప్రాథమిక పాఠశాలను బీజేపీ జిల్లా కార్యదర్శి మండపాక భారతి శనివారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పీఎం పోషణ పథకంలో భా గంగా విద్యార్థులకు మెనూ ప్రకారం రోజూ నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట సీఆర్పీ రామసూరిరెడ్డి ఉన్నారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

గజపతినగరం: మండలంలోని 42 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ విమలమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, తల్లిదండ్రుల ఓటర్ల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుల్లో పెట్టిం చామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై 5వ తేదీన అభ్యంతరాల స్వీకరించి, అదేరోజు తుదిజాబితాను విడుదల చేస్తామని వివరించారు. 8వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం 1:30 గంటల లోపు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈఎన్నికలు గజపతినగరం మండలంలోఎన్నికలు జరగనున్నాయని అన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

విజయనగరం: నగరంలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటకేంద్రమైన రామనారాయణంలో సీతారాముల కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని, ఉదయం ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష, తేజల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం కనుల పండువగా స్వామి వారి కల్యాణం జరిగింది. ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, నారాయణం సీతారామయ్య పాల్గొన్నారు.

నల్లఇసుక దందాపై ఆరా

భోగాపురం: మండలంలోని ముక్కాం, చేపలకంచేరు సముద్ర తీర ప్రాంతాల్లో జరుగుతున్న నల్లఇసుక దందాపై తహసీల్దార్ సురేష్, సీఐ రవికుమార్ స్థానికులను ఆరాతీశారు. ఈ నెల ఒకటో తేదీన సాక్షి దినపత్రికలో నల్ల ఇసుక దందా పేరుతో ప్రచురితమైన కథనానికి సదరు అధికారులు స్పందించారు. శనివారం ఆయా ప్రాంతాలకు వెళ్లి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. అక్రమార్కులు ఇక్కడి ఇసుక తరలించకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, మెరైన్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు.



చేపలకంచేరు సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్, సీఐ రవికుమార్